క్లుప్తంగా

విద్యుత్ స్తంభాలు ఏర్పాటు



వీపనగండ్ల: మండలంలోని నాగర్లబండతండా లో సరైన విద్యుత్ వసతి లేక స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించే విధంగా సోమవారం స్తంభాలు ఏర్పాటు చేయడంపై తండావాసులు హర్షం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యను మంత్రి జూపల్లి కృష్ణారావుకు వివరించారు. వెంటనే 18 స్తంభాలు ఏర్పాటు చేయాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించగా.. వారు పనులు వేగంగా పూర్తి చేశారు. కాంగ్రెస్ నాయకులు గోపాల్‌నాయక్, రదియానాయక్, భాస్కర్, తుల్యానాయక్, లాలు, నర్సింహ, హన్మంతు, ప్రకాష్ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

పీఏసీఎస్‌ను ఏర్పాటు చేయండి



అమరచింత: నూతనంగా ఏర్పడిన అమరచింత మండలానికి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఏర్పాటు చేయాలంటూ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరికి సోమవారం మాజీ ఎంపీటీసీ తిరుమలేష్ వినతిపత్రం అందించారు. ఉమ్మడి ఆత్మకూర్ మండలం పీఏసీఎస్ అమరచింతలోనే ఉండేదని అలాంటిది ఆత్మకూర్‌కు తరలించడంతో స్థానికంగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం లేదన్నారు. సహకార సంఘానికి సంబంధించి స్థలం ఉందని, భవన నిర్మాణం కోసం నిధులు మంజూరు చేయడంతో పాటు సొసైటీ ఏర్పాటుకు కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో హరీశ్‌నాయక్, రాకేష్‌గౌడ్ పాల్గొన్నారు.

సీడీపీఓకు వినతి



వనపర్తి రూరల్: నూతన జాతీయ విద్యా విధానాన్ని ఉపసంహరించుకోవాలని, నిర్బంధ విద్యా వ్యవస్థకు ఈసీసీఈ లింక్ చేయరాదని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పుట్ట ఆంజనేయులు అన్నారు. మే 20న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ పాల్గొంటారని తెలియజేస్తూ అంగన్‌వాడీ టీచర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం అంగన్‌వాడీ సీడీపీఓ హజీరాకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, పద్మ, సుమిత్ర, భాగ్య, శ్రీలక్ష్మి, తిరుపతమ్మ, వసంత తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడి కుటుంబానికి ఆర్థిక చేయూత



వనపర్తిటౌన్: పట్టణానికి చెందిన మహేష్ గత నెల 17న గుండెపోటుతో మృతి చెందాడు. అతడితో కలిసి 1990–91 సంవత్సరంలో 10వ, తరగతి చదువుకున్న మిత్రులందరూ కలిసి రూ.1.51లక్షలు జమచేసి మహేష్ ముగ్గురు కుమార్తె పేరు మీద పోస్టాఫీస్‌లో డిపాజిట్ చేసి సంబంధించిన పత్రాన్ని భార్య అనిత, కుమార్తెలకు అందజేశారు. కార్యక్రమంలో వెంకటేష్, శ్రీనివాస్, సిద్ధు, చందు, కిశోర్, మోహన్‌సాగర్, ఉప్పాల భాస్కర్, వెంకటరమణ, జగదీశ్‌రెడ్డి, అంజి, మహేష్, జిలాని, ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

నేటి నుంచి ప్రతిష్ఠాపన ఉత్సవాలు

మానవపాడు: మండలంలోని గోకులపాడు గ్రామంలో మంగళవారం నుంచి ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు, రైతు సంఘం సభ్యులు సోమవారం తెలిపారు. మే 1వ తేదీ గురువారం వరకు ప్రతిష్ఠ కార్యక్రమాలు ఉంటాయన్నారు. మంగళవారం గణపతిపూజ, పుణ్యాహవచనం, నంది మాతృకాపూజ, మండపపూజ, నవగ్రహవస్తు, అంకురార్పణ, సర్వతోభద్ర మండలదేవతాహ్వానం, బుధవారం ప్రాతఃకాలపూజ, దీక్షహోమం, శాంతిహోమం, నవగ్రహవాస్తు, మంగళహారతి, గురువారం ఉదయం 7.22నిమిషాలకు విగ్రహాలు, బొడ్రాయి, నవగ్రహ, ధ్వజస్తంభ, ప్రతిష్ఠించనున్నట్లు పేర్కొన్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి వారి కృపకు పాత్రులు కాగలని పేర్కొన్నారు.

రైతుల సంక్షేమమే ముఖ్యం

పాన్‌గల్: రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని ధాన్యానికి మద్దతు ధర పొందాలని సింగిల్ విండో సీఈఓ భాస్కర్‌గౌడ్, మాజీ సర్పంచ్ విష్ణునాయుడు అన్నారు. సోమవారం మండలంలోని బహదూర్‌గూడెంలో సింగిల్ విండో ఆధ్వర్యంలో వరికొనుగోలు కేంద్రాన్ని స్థానిక నాయకులతో కలిసి వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం వరికి మద్దతు ధరతో పాటు సన్న వడ్లకు క్వింటాల్‌కు రూ.500 బోనస్ అందిస్తుందన్నారు. రైతుల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో లక్ష్మయ్య, దర్గయ్యనాయుడు, తిరుపతయ్యనాయుడు, విష్ణు, రైతులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం సేకరణలో రైతులకు ఇబ్బందులు కలగించొద్దని మండల వ్యవసాయాధికారి (ఏఓ) రాజవర్ధన్‌రెడ్డి నిర్వాహకులకు సూచించారు. సోమవారం మండలంలోని మాందాపూర్, మల్లాయిపల్లి గ్రామాల్లోని వరి కొనుగోలు కేంద్రాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం తేమ శాతం పరిశీలించారు. కేంద్రాలకు తీసుకొచ్చే ధాన్యంలో తాలు, చెత్త లేకుండా కేంద్రాలకు చూడాలని ఏఓ రైతులకు సూచించారు. కేంద్రాల్లో రైతులకు నీడ, నీటి వసతి తప్పక ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

వీపనగండ్ల: కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చే వరి ధాన్యాన్ని ఆరబెట్టి తాలు లేకుండా నాణ్యమైనదిగా తీసుకురావాలని ఏపీఎం బిచ్చన్న, వెలుగు సీసీ వీరయ్య రైతులకు విజ్ఞప్తి చేశారు. సోమవారం రంగవరంలో మండల మహిళా సమైక్య ద్వారా ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాన్ని వారు ప్రారంభించారు. కార్యక్రమంలో అనిత, జయమ్మ, కుర్వ తమ్మ, పంచాయతీ కార్యదర్శి జీవిత పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్ కమిటీ చైర్మన్ పి.ప్రశాంత్ అన్నారు. సోమవారం మండలంలోని పామాపురంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ఎల్లంపల్లి నరేందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, ఐకేపీ సభ్యులు, రైతులు తదితరులు ఉన్నారు.



బహదూర్‌గూడెంలో వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ, నాయకులు



మల్లాయిపల్లిలో..



రంగవరంలో..

సమ్మర్ క్యాంపును సద్వినియోగం చేసుకోవాలి



మానాజీపేటలో విద్యార్థులతో లెక్కలు చేయిస్తున్న ఎంఈఓ జయశంకర్

ఖిల్లాఘనపురం: మానాజీపేట హెల్పింగ్ హ్యాండ్ సంస్థ వారి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమ్మర్ క్యాంపును విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ జయశంకర్ అన్నారు. మండలంలోని మానాజీపేటలో ఏర్పాటు చేసిన క్యాంపును ఎంఈఓ పరిశీలించారు. ఉపాధ్యాయులు రాఘవేందర్ నిత్యం విద్యార్థులకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు వేసవిలో విద్యార్థులు చదువుకు దూరం కాకుండా విద్యతో పాటుగా ఆటలు, పాటలు పాడించడం, కథలు, డ్రాయింగ్‌పై శిక్షణ ఇవ్వడం అభినందించదగిన విషయమన్నారు. ఈ క్యాంపులో విద్యార్థులకు గణితంలో మెలుకువలతో పాటు కబడ్డీ, ఖోఖో, చెస్ లాంటి ఆటలపై శిక్షణ ఇస్తున్నారు. స్టడీ మెటీరియల్ అందిస్తున్నారు. అదే విధంగా గ్రామానికి చెందిన మేరెడ్డి రవిప్రకాష్‌రెడ్డి తన సొంత ఖర్చుతో విద్యార్థులకు అల్పాహారం అందిస్తున్నారు. క్యాంపు నిర్వహణకు గాను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వలంటీర్లు, స్టడీ మెటీరియల్ ఖర్చును సంస్థ వారు భరిస్తున్నారు.

యూనిఫాంల దుస్తుల కటింగ్ పరిశీలన

మండల కేంద్రంలోని మండల మహిళా సమాఖ్య భవనంలో పాఠశాలల విద్యార్థుల యూనిఫాం దుస్తుల కటింగ్‌ను ఎంఈఓ జయశంకర్ పరిశీలించారు. జూన్ 12వ తేదీ పాఠశాలలు తెరిచే సమయానికి ఒక జత బట్టలను విద్యార్థులకు అందించేందుకు సిద్ధం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏపీఎం రాంబాబు తదితరులు ఉన్నారు.

సారూ.. ట్రైసైకిల్ ఇప్పించండి



అమరచింత: 'సారు.. నాకు రెండు కాళ్లు లేవు' నడవడానికి ఇబ్బందిగా ఉంది. అంతలోనే మా అక్క, బావ చనిపోవడంతో వారి కూతురు భవితను చదివించాల్సిన బాధ్యత నాపై పడింది. తను ప్రస్తుతం ఐదో తరగతి పూర్తి చేసింది. ఆమెకు గురుకులంలో సీటు ఇప్పించి, తనకు ట్రై సైకిల్ ఇప్పించమంటూ గ్రామానికి చెందిన రాజమ్మ ఎమ్మెల్యే, కలెక్టర్‌కు కోరుతూ వినతిపత్రం అందించారు. అమరచింత మండలం నాగల్‌కడ్మూర్ గ్రామానికి సోమవారం భూ భారతి చట్టం అవగాహన కల్పించేందుకు వచ్చిన ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, కలెక్టర్ ఆదర్శ్ సురభికి గ్రామానికి చెందిన దివ్యాంగురాలు ట్రై సైకిల్ ఇప్పించమని వేడుకుంది. దీంతో స్పందించిన వారు వెంటనే ట్రైసైకిల్‌తో పాటు చిన్నారికి గురుకులంలో సీటు ఇప్పిస్తామని హామీ ఇచ్చారు.

మెరుగైన వైద్యం కోసం సీఎంఆర్‌ఎఫ్

గద్వాల: పేదలకు మెరుగైన వైద్యం కోసం సీఎం రిలీఫ్ ఫండ్ ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. సోమవారం క్యాంప్ క్యాంపు కార్యాలయంలో మండలంలోని అనంతపురం గ్రామానికి చెందిన శాంసన్‌కు మెరుగైన వైద్యం కోసం రూ.2.50లక్షలు, మల్దకల్ విఠలాపురం గ్రామానికి చెందిన పార్వతమ్మకు రూ.2.50లక్షల ఎల్‌ఓసీని వారి కుటుంబ సభ్యులకు అందజేశారు. కార్యక్రమంలో బండారీ భాస్కర్, గ్రంథాలయ జిల్లా మాజీ చైర్మన్ రామన్‌గౌడ్, మాజీ సర్పంచ్ పురుషోత్తంరెడ్డి, మాజీ కౌన్సిలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఇందిరమ్మ' లబ్ధిదారుల సర్వేలో గందరగోళం



మల్లాయిపల్లిలో లబ్ధిదారుల వివరాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గోవింద్‌రావు



అమరచింత పట్టణంలోని 5వ వార్డులో..

అమరచింత: మున్సిపాలిటీలోని 4, 5 వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారుల వివరాలను పరిశీలించేందుకు వచ్చిన మున్సిపల్ కమిషనర్ రవిబాబుతో ఆయా వార్డు ప్రజలు వాగ్వాదానికి దిగారు. పట్టణంలోని ఆయా వార్డుల్లో అధికారులు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి అసలైన అర్హులేనా అని పరిశీలిస్తున్నారు. ఈ క్రమంలో అక్కడికి చేరుకున్న వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు, ప్రజలు మున్సిపల్ కమిషనర్‌ను అడ్డుకున్నారు. నిబంధనలకు విరుద్ధంగా లబ్ధిదారులను గుర్తించారని, ఇందిరమ్మ కమిటీ సభ్యులతో చర్చించకుండానే ఏకపక్షంగా జాబితాలను సిద్ధం చేయడం ఏమిటని కమిషనర్‌ను ప్రశ్నించారు. దీంతో కొంతసేపు వారి మధ్య వాగ్వాదం జరుగగా మున్సిపల్ కమిషనర్ అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఈమేరకు వ్యవసాయ కార్మిక సంఘం, సీపీఎం నాయకులు మాట్లాడుతూ ప్రతి వార్డుకు 30 ఇళ్లు మంజూరు చేయాలని, ఇంత వరకే పునాది వేసుకున్న వారికి సైతం ఇంటిని మంజూరు చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో రాజు, అజయ్, బుచ్చన్న, అరుణ్ తదితరులు పాల్గొన్నారు.

పాన్‌గల్: గ్రామాల్లో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఇచ్చిన అర్హుల వివరాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పారదర్శకంగా లబ్ధిదారులను ఎంపిక చేస్తామని ఎంపీడీఓ గోవింద్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని దావాత్‌ఖాన్‌పల్లి, మంగ్లళపల్లి, మల్లాయిపల్లి గ్రామాల్లో లబ్ధిదారుల వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకు ఇల్లు నిర్మించుకున్న వారికే బిల్లులు మంజూరు అవుతాయన్నారు.

బాల్య వివాహం చట్టరీత్యా నేరం

పాన్‌గల్: మైనర్ బాలికను వివాహం చేసుకునేందుకు సిద్ధపడిన అబ్బాయిపై తగు చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమవారం ఫిర్యాదు చేసినట్లు హెడ్ కానిస్టేబుల్ రోశయ్య తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఓ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు ఎంగేజ్‌మెంట్ చేస్తున్నారని ఈనెల 20వ తేదీన 1098 ట్రోల్ ఫ్రీ నంబర్‌కు సమాచారం వచ్చిందన్నారు. దీంతో డిపార్ట్‌మెంట్ వారితో కలిసి బాలిక ఇంటికి వెళ్లి అమ్మాయి చదువుకున్న ధ్రువపత్రాలను పరిశీలించగా వయస్సు 15సం.10 నెలల 3 రోజులుగా ఉందన్నారు. మైనర్ బాలికతో వివాహం చేయడం చట్టరీత్యా నేరమని తల్లిదండ్రులకు, ఎంగేజ్‌మెంటుకు హాజరైన వారందరికీ అవగాహన కల్పించినట్లు పేర్కొన్నారు. అవగాహన కల్పించినా.. వాటిని పెడచెవిన పెట్టి మండలంలోని అన్నారం గ్రామానికి చెందిన శంకర్‌తో మైనర్ బాలికతో వివాహం జరిపించుటకు పెద్దలందరూ నిర్ణయించుకొని ఈనెల 23వ తేదీన ఎంగేజ్‌మెంట్ జరిపించారు. దీంతో మైనర్ బాలికను వివాహం చేసుకునేందుకు ముందుకొచ్చిన అబ్బాయి శంకర్‌పై బాల్య వివాహ నిషేధ చట్టం –2006 ప్రకారం తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సోమవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు హెచ్‌సీ తెలిపారు.

ధర్మప్రచార సమితి సభ్యులకు శిక్షణ

ఎర్రవల్లి: మండల పరిధిలోని బీచుపల్లి కోదండరామస్వామి ఆలయంలో వచ్చే నెల 4, 5వ తేదీల్లో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార సమితి కమిటీ సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ధర్మప్రచార సమితి జిల్లా ప్రముఖ్ సత్యం రామానుజ దాసః సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 4వ తేది సాయంత్రం 4గంటల నుంయి 5వ తేదీ సాయంత్రం 4గంటల వరకు శిక్షణ కార్యక్రమం ఉంటుందన్నారు. నియోజకవర్గంలోని ఆయా మండలాలతో పాటు గ్రామ కమిటీ సభ్యులు అధిక సంఖ్యలో హాజరై శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. శిక్షణకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ తమ వెంట నిత్యావసర వస్తువులు తప్పకుండా తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా

పాన్‌గల్: 'కొనుగోలు కేంద్రాల్లో అన్నదాతల ఇబ్బందులు' అనే శీర్షికన సోమవారం 'సాక్షి' దినపత్రికలో వచ్చిన వార్తకు అధికారులు స్పందించి సోమవారం పాన్‌గల్ ఐకేపీ కొనుగోలు కేంద్రంలో ధాన్యం కాంటా ప్రారంభించారు. రైతుల ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లి ధాన్యం కాంటా చేసే విధంగా కృషి చేసిన సాక్షి దినపత్రికకు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.

సాక్షి ఎఫెక్ట్..



కార్మిక వ్యతిరేక విధానాలతో శ్రమదోపిడి



మాట్లాడుతున్న సురేష్

ఖిల్లాఘనపురం: ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలతో కార్మికుల శ్రమదోపిడి జరుగుతుందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో సమావేశం నిర్వహించారు. అనంతరం 139వ మే డే వాల్‌పోస్టర్, కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం సమరశీల పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. బ్రిటీష్ కాలం నుంచి కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి 44 కార్మిక చట్టాలను సాధించుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కోశాధికారి భాస్కర్, ఆస్పత్రి సిబ్బంది ఆర్.ఉదయ్‌కుమార్, నాగయ్య, భీమయ్య, మునిందర్, సాయికృష్ణ, ప్రియాంక, సంగీత, రంగమ్మ, స్వాతి పాల్గొన్నారు.

వనపర్తి రూరల్: కేంద్ర ప్రభుత్వం 44 కార్మిక చట్టాలను సవరణల పేరుతో 29 కార్మిక చట్టాలను రద్దుచేసి, నాలుగు లేబర్ కోడ్‌ల రూపంలో తెచ్చిన చట్టం రద్దు చేస్తారా లేక గద్దె దిగుతారో తేల్చుకోవాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర కార్యదర్శి పి.సురేష్ అన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎంసీఎచ్ ఆస్పత్రిలో పారిశుద్ధ్య ,సెక్యూరిటీ పేషెంట్ కేర్ కార్మికులతో మే డే సన్నాహక సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో గంధం శ్రీనివాసనరసింహ, రాజేష్, నరేందర్‌కుమార్, భరత్, అశోక్, భాను, మోహన్, మధు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

ఈదమ్మ ఉత్సవాలకు సర్వం సిద్ధం

- నేటి నుంచి ప్రారంభం
- అంతర్రాష్ట్ర పోటీల నిర్వహణ



ముస్తాబైన ఆలయం

అలంపూర్: మండల పరిధిలోని క్యాతూర్ గ్రామంలో వెలిసిన ఈదమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలు ఈనెల 29న మంగళవారం నుంచి ప్రారంభం కానున్నట్లు నిర్వాహక కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలో ప్రతి ఏడాది ఈదమ్మ అమ్మవారి దేవర ఉత్సవాలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తున్నట్లు పేర్కొన్నారు. దేవరను పురస్కరించుకొని గ్రామంలో అంతర్రాష్ట్ర వృషభాల బండలాగుడు పోటీలు, పురుషుల కబడ్డీ పోటీలు, ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంతర్రాష్ట్ర పురుషుల కబడ్డీ పోటీలు ఈనెల 29, 30 తేదీ ఉదయం 8.30 గంటలకు రెండు రోజులపాటు జరుగనున్నట్లు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు మొదటి బహుమతి రూ.40 వేలు, రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి రూ.10 వేలు, నాల్గవ బహుమతి రూ.8 వేలు, ఐదవ బహుమతి రూ.5 వేలు అందించనున్నట్లు తెలిపారు. పోటీల్లో పాల్గొనే జట్లు ప్రవేశ రుసుం రూ.500 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 30న ట్రాక్టర్ ట్రాలీ రివర్స్ పోటీలు, అంతర్రాష్ట్ర వృషభాల న్యూ క్యాటగిరీ విభాగం బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజేతలకు దాతల సహకారంతో బహుమతులు అందించనున్నట్లు కమిటీ సభ్యులు పేర్కొన్నారు.

ఎన్నికల హామీల అమలులో విఫలం



కొండేరులో రైతులతో ముచ్చటిస్తున్న బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు

ఎర్రవల్లి: ప్రభుత్వం రైతులను నిట్టనిలువునా మోసం చేస్తుందని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మండిపడ్డారు. సోమవారం మండల పరిధిలోని కొండేరు శివారులో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో ముచ్చటించారు. కొనుగోలు కేంద్రంలో వారు పడుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం రాంబాబు మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో రైతులు పండించిన అన్ని పంటలకు బోనస్ ఇస్తామని చెప్పి, కేవలం సన్న రకం వడ్లకు మాత్రమే బోనస్ ఇచ్చి చేతులు దులుపుకోవడం సిగ్గుచేటన్నారు. మొక్కజొన్న, జొన్న, కంది పంటలకు ఎలాంటి బోనస్ ఇవ్వకుండా ప్రభుత్వం ఆ పంటలు సాగు చేసిన రైతులను నిండా ముంచుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరుగాలం శ్రమించి కష్టపడి పండించిన వరి ధాన్యాన్ని తేమశాతం పేరిట కొనుగోలు చేయకుండా ఆపడం విడ్డూరంగా ఉందన్నారు. అకాల వర్షాలు కురవడంతో కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు తీవ్ర అవస్థలు పడుతున్నట్లు తెలిపారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి ఎలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేసి మద్దతు ధరను అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య కోరల్లో పరమేశ్వరుడి చెరువు



పరమేశ్వరస్వామి చెరువు వద్ద వ్యర్థాలు

- కోళ్లు, గొర్రెల వ్యర్థాలతో దుర్వాసన
- చెత్తాచెదారమంతా ఇక్కడే..
- డంపింగ్‌యార్డు ఉన్నా ప్రయోజనం సున్నా
- ప్రత్యేకాధికారుల పాలనపై విమర్శలు

ఆత్మకూర్: పట్టణ శివారులోని పరమేశ్వరస్వామి చెరువు కలుషితమై చెత్తాచెదారం, దుర్వాసన వెదజల్లుతుండడంతో స్థానికులు, ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారిందని, ఇందుకు ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువే నిదర్శమని స్థానికులు మండిపడుతున్నారు. చెరువులో సగానికిపైగా నీరు తగ్గడంతో చేపల వాసనతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు. దీనికితోడు స్థానికులు, చికెన్, మటన్ వ్యాపారస్తులు వ్యర్థాలన్నీ ఇక్కడే పారబోస్తుండడంతో దుర్వాసనతో కలుషితమైన నీటితో వెక్కిరిస్తోంది. చెరువుకట్ట ఎక్కి దిగేంత వరకు ముక్కు మూసుకుని వెళ్లాల్సిందే. కొంతమంది నిర్లక్ష్యం కారణంగా చెరువు కలుషితం అవుతుండడంతో అధికారుల పనితీరుపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. మత్స్యకారులు చెరువులో చేపల పెంపకాన్ని చేపడుతున్నారు. ఈ వ్యర్థాలతో చేపలకు కూడా ముప్పు వాటిల్లితుందని చేపలు చనిపోతున్నాయని మత్స్యకారులు వాపోతున్నారు. మున్సిపాలిటీ అధికారులు ఇప్పటికైనా స్పందించి వ్యర్థాలు తొలగించి చెరువును సంరక్షించాలని స్థానికులు, ప్రయాణికులు కోరుతున్నారు.



చెరువు కట్టపై..

దుర్వాసన భరించలేకున్నాం



ఆత్మకూర్ పరమేశ్వరస్వామి చెరువులో మత్స్యకారులకు చేపల పెంపకంతోపాటు ఆయకట్టు రైతులకు సాగునీరు అందుతోంది. కొంతమంది ఇక్కడ వ్యర్థాలు, చెత్తాచెదారం వేస్తుండడంతో దుర్వాసన వెదజల్లడంతో పాటు నీళ్లు కలుషితం అవుతున్నాయి. ప్రత్యేకాధికారుల పాలన అస్తవ్యస్తంగా మారింది. ఇప్పటికైనా అధికారులు, కలెక్టరు దృష్టి సారించాలి.

– బాలు, వివేకానంద సేవాసమితి అధ్యక్షుడు, ఆత్మకూర్

చర్యలు తీసుకుంటాం



పరమేశ్వరస్వామి చెరువును అభివృద్ధి పరుస్తున్నాం. ఇదివరకే చెరువుకట్టపై చెట్లను నాటడంతో పాటు స్తంభాలు ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ లైట్లు బిగించాం. చెత్తను తొలగించేందుకు ట్రాక్టర్‌తో పాటు రెండు ఆటోలు ఏర్పాటు చేసి, ప్రతినిత్యం చెత్తను సేకరిస్తున్నాం. అయినా కొంతమంది వ్యర్థాలను పారబోస్తున్నారు. అలాంటి వారిపై కఠినమైన చర్యలు తీసుకుని జరిమానాలు విధిస్తాం.

– శశిధర్, కమిషనర్, ఆత్మకూర్